వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

- ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి
- ఉండి, ఆకివీడు మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు

ఉండి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ఉండిలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి వారి మద్దతు కోరాలన్నారు. ప్రజలకు జరిగిన మంచిని చెప్పి వారిని ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఉండి సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ కల్యాణ్‌వర్మ పాల్గొన్నారు.


ఉండిలో పార్టీ మండల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, వేదికపై పాతపాటి శ్రీనివాసరాజు

ఉండిలో ప్రతిపక్షాన్ని కూకటి వేళ్లతో పీకేద్దాం!

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో ప్రతిపక్షాల్ని కూకటివేళ్లతో పీకేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో సోమవారం చినకాపవరంలోని జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే తొమ్మిది నెలలూ పార్టీ బలోపేతానికి అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు నేతృత్వంలో పలు గ్రామాలు అభివృద్ధి బాటలో ఉన్నాయన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పీవీఎల్ పనిచేస్తున్నారన్నారు. పీవీఎల్‌ను వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీలో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తనను కలవాలని సూచించారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, తంగి పుష్కరరావు, మండల కన్వీనర్ జీ.ధనరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి రాజాకు ఎమ్మెల్యే శ్రీనివాస్ పరామర్శ


మంత్రి దాడిశెట్టి రాజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: మాతృమూర్తిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. తూర్పుగోదావరి జిల్లా తునిలోని మంత్రి నివాసంలో ఇటీవల మరణించిన సత్యనారాయణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాజా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ వెంట భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నర్సింహరావు, కొట్టి కుటుంబరావు, నామన మహేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కాళ్ల: కోమటిగుంటలో శ్రీవిజయ కనకదుర్గమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, పుణ్యనదీ జలాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మాజీ సర్పంచ్ యలమంచిలి రామాంజనేయులు, వెంకటవిజయలక్ష్మి దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత

ఉండి: చిలుకూరు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులకు తన సొంత సొమ్ముతో టైలు, ఐడీ కార్డులను సర్పంచ్ వెంకట సోమరాజు సోమవారం అందజేశారు. ఉపాధ్యాయులు పీ డేవిడ్‌రాజు, బీ రాజ్యలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివారు పొలాల పరిశీలన

వీరవాసరం: సార్వాసాగులో ఏ ఒక్క రైతుకి నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఏఈ కేశ్రీనివాస్ చెప్పారు. మత్స్యపురి శివారులో పంట భూములను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

ఆకివీడు: మండలంలోని దకాపవరం శివారు కుందుగుడెం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమై, సుమారు రూ.ఆరు లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో రెండు పోర్షన్లు ఉన్న రెండు తాటాకిళ్లల్లో మద్దా వెంకటేశ్, ఇమానియేలు, ఇస్రాయిల్, కరుటూరి ఇమేలురాజు కుటుంబాలు ఉంటున్నాయి. మద్దా వెంకటేష్ ఇంట్లో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే రెండు కుటుంబాల వారు బయటకు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు పక్కనే ఉన్న మరో తాటాకిల్లుకు కూడా వ్యాపించి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనా స్థలాన్ని ఎంపీపీ కఠారి జయలక్ష్మి పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడి తక్షణ సహాయం అందజేయాలని ఆదేశించారు.

కలిసిపూడిలో వార్డు సభ్యుని పదవి ఏకగ్రీవం


ఎన్నికైన చింతమ్మ కొక్కిరి (ఫైల్)

ఉండి: కలసిపూడి గ్రామ పంచాయతీ 3వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో ఏవీ అప్పారావు సోమవారం చెప్పారు. ఎన్నికల బరిలో చింతమ్మ కొక్కిరి, దాసి రాహేలమ్మ, దంతమాల ఫిలేమేన్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్‌ల ఉపసంహరణ సందర్భంగా దాసి రాహేలమ్మ, దంతమాల ఫిలేమేన్ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో చింతమ్మ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

మెంటేపూడి 3వ వార్డు సభ్యుని పదవి ఏకగ్రీవం

వీరవాసరం: మెంటేపూడి మూడో వార్డు సభ్యులుగా చిలకమర్తి కొండా రత్నం నామినేషన్ ఒకటి మాత్రమే మిగిలి ఉండడంతో ఏకగ్రీవం అయిందని ఇంచార్జ్ ఎంపీడీవో ఉమామహేశ్వర సోమవారం తెలిపారు. మత్స్యపురి గ్రామంలో జరుగుతున్న గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు రెండు నామినేషన్లు మిగిలాయని పేర్కొన్నారు. కారేపల్లి విజయ్ కుమారి, కారేపల్లి విజయలక్ష్మి మధ్య పోటీ నెలకొందని ఎంపీడీవో వివరించారు.

శృంగవృక్షంలో డంపింగ్ యార్డుకు హైకోర్టు ఆదేశం

పాలకోడేరు: శృంగవృక్షంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని హైకోర్టు జస్టిస్ నైనాల జయసూర్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆరు వారాలు గడువు నిర్దేశిస్తూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేక చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. డంపింగ్ యార్డుకు స్థలం లేదంటూ అధికారులు, పంచాయతీ పాలకవర్గం చేతులెత్తేశారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ చొరవ తీసుకుని, గ్రామంలో ఎకరన్నర స్థలం ఉందని, అందులో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చర్య తీసుకోవాలంటూ హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆరు వారాల్లోగా డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి నైనాల జయసూర్య ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అట్రాసిటీ కేసు నమోదుకు వినతి

ఉండి: చెరుకురసం ఇవ్వలేదనే నెపంతో దళిత యువకుడు కమతం రమేష్‌పై దాడి చేసి గాయపర్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ఐక్యవేదిక నాయకుడు గంటా సుందర్‌కుమార్ అన్నారు. సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడుకు దళిత ఐక్యవేదిక నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నార్పీ అగ్రహారంలో చెరుకురసం అమ్ముకుంటున్న కమతం రమేష్ అనే దళిత యువకుడిని ఈ నెల 11న కొందరు కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా దాడి చేసి కొట్టి గాయపర్చారన్నారు. నిందితులను అరెస్టు చేయాలని సుందర్‌కుమార్ కోరారు.

బడుల్లో విద్యార్థి వినియోగదారుల క్లబ్‌లు

సాక్షి, భీమవరం: పాఠశాల స్థాయిలో విద్యార్థి వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. సోమవారం భీమవరంలోని పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో విద్యార్థి వినియోగదారుల క్లబ్స్ ఏర్పాటుపై జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో వినియోగదారులు అనేక మోసాలకు, అన్యాయాలకు గురవుతున్నారని, అందువల్ల విద్యార్థి దశ నుంచే 8, 9 తరగతుల విద్యార్థులతో వినియోగదారుల క్లబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్‌లు ఉద్దేశాలు, లక్ష్యాల వంటివాటిపై సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. భీమవరం ఉపవిద్యాశాఖాధికారి డి.శ్రీరామ్, ప్రధానోపాధ్యాయిని జె.సుధారాణి, మాస్టర్ ట్రైనర్స్ కె.కృష్ణప్రసాద్, జి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో వ్యక్తి గల్లంతు

సాక్షి, భీమవరం: పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లో ఓ వ్యక్తి గల్లంతైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై పి.అప్పారావు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన నక్కా నవీన్ యనమదుర్రు డ్రెయిన్‌పైన ఉన్న కాలినడక వంతెన వద్ద సోమవారం సాయంత్రం డ్రెయిన్‌లోకి దూకాడు. అతన్ని రక్షించడానికి అదే ప్రాంతానికి చెందిన కానుబోయిన పెద్దిరాజు డ్రెయిన్‌లోకి దూకగా నవీన్ గట్టుకు చేరుకున్నప్పటికీ పెద్దిరాజు ఆచూకీ తెలియలేదని అతని బావ జె.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

'సప్త సప్త సప్తాహ' సంకీర్తన ప్రారంభం

కాళ్ల: వేంపాడులోని శ్రీసీతారామాలయం వార్షిక మహోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో సప్త సప్త సప్తాహ' (343) నిరంతర భగవన్నామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ప్రారంభించి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చిట్టురాకుల చిరంజీవి, క్రాంతి ప్రియ దంపతులతో ఆలయ అర్చకులు చావలి ఫణిశర్మ ప్రత్యేక పూజలను జరిపించారు. సుమారు 350 మంది భక్తులతో నిరంతర భగవన్నామ సంకీర్తన సాగింది. నిర్వాహకులు బంగారుబాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది ఏప్రిల్ 17న శ్రీరామనవమి వరకు ప్రతిరోజు సప్త సప్త సప్తాహ నిరంతర భగవన్నామ సంకీర్తన జరుగుతుందని, అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా 343 రోజులు పూజ చేసుకున్న భక్తులకు శ్రీరామనవమి రోజున లక్కీడిప్ ద్వారా నాలుగు గ్రాముల బంగారాన్ని బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. కుమార్, కాసా శ్రీను, భూసారపు వీరబాబు, వేగేశ్న సీతారామరాజు, రామకృష్ణరాజు, బంగారు నాగలక్ష్మి ఆండాళ్లు భక్తులు పాల్గొన్నారు.